క్లుప్తంగా

నీతివంతమైన జీవితం అలవరుచుకోవాలి


విద్యార్థులకు సూచనలిస్తున్న బాలు నాయక్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నీతి కథల్లో నీతిని అర్థం చేసుకుని తమ జీవితాలను కూడా నీతివంతంగా మలుచుకోవాలని గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా గ్రంథాలయ సిబ్బంది ఆవు – పులి నీతి కథలు బోధిస్తు కథల్లోని నీతిని విద్యార్థులతో చెప్పించారు. ఎలక్ట్రికల్ ఇంజినీర్ వి.బాలునాయక్ పాల్గొని నేటీ బాలలే రేపటి పౌరులు, పుస్తకాలే నేస్తాలని వివరించారు. రిసోర్స్ పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులకు యోగా తరగతులు చెప్పి, సరదా ఫన్నీ గేమ్స్ ఆడించారు. పి.శంకర్ డ్రాయింగ్ తరగతులను కొనసాగించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు వీటీ సందీప్ కుమార్, ఎండీ అస్లాం పాషా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: పెదవేగి మండలం అంకన్నగూడెంకు చెందిన పల్లెపాముల శ్రీను (34) తీవ్ర మనస్థాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు జీజీహెచ్ ఔట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనుకు భార్య, పిల్లలు ఉన్నారు. శ్రీను కొంతకాలంగా మద్యానికి బానిసగా మారటంతో భార్య వెంకటలక్ష్మి కొద్దిరోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో శ్రీను ఒక్కడే ఉంటున్నాడు. ఒంటరితనాన్ని భరించలేని శ్రీను తీవ్ర మానసిక వేదనతో మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతడ్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన జీజీహెచ్ వైద్యులు శ్రీను అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. పెదవేగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న విద్యుత్ సిబ్బంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004వ సంవత్సరం మధ్య వరకు ఉద్యోగం పొందిన సిబ్బందికి జీపీఎఫ్ సౌకర్యం కలిపంచాలని విద్యుత్ జీపీఎఫ్ సధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నగరానికి వచ్చిన చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు సమితి వినతిపత్రం అందజేశారు. సిబ్బంది డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమితి నాయకులు పి.శ్రీనివాస్, కె.కృష్ణకుమార్, వై.శ్రీనివాస్ తదితరులున్నారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత

ఏలూరు (టూటౌన్): కారుణ్య నియామకాల్లో భాగంగా గూడ దేవాశిష్ కిరణ్‌కు పార్కు గార్డెన్‌గా నియమిస్తూ ఏలూరునగర కమిషనర్ ఎ.భాను ప్రతాప్, కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు మంగళవారం పత్రం అందజేశారు. స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) విధులు నిర్వహిస్తూ మరణించిన అరవ సుష్మ కుమారి కుమారుడు గూడ దేవాశిష్ కిరణ్‌కు ఈ ఉత్తర్వులను అందించారు. ఏలూరు కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణించిన దుర్గాసి సుధాకర్ భార్య జాహ్నవికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు అండగా రెడ్‌క్రాస్

- నెలకు 80 మందికిపైగా రక్తమార్పిడి చికిత్స
- ఏలూరు, తణుకు, నరసాపురం ప్రాంతాల్లో బ్లడ్ బ్యాంకులు


ఏలూరు జీజీహెచ్‌లోని తలసేమియా భవనం


రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బాలుడికి రక్తమార్పిడి చికిత్స (ఫైల్)

ఏలూరు టౌన్: రక్త దానం ప్రాణదానంతో సమానం. కృత్రిమంగా తయారు చేయలేని జీవపదార్థం రక్తం మాత్రమే. తీవ్ర అనారోగ్య స్థితిలో ఉన్న మనిషిని ప్రాణంతో నిలబెట్టేందుకు రక్తం అవసరం. ముఖ్యంగా జన్యులోపాలతో సంక్రమించే తలసేమియా వ్యాధి బాధితులకు నిత్యం రక్త మార్పిడి చికిత్స చేస్తూ ఉండాలి. చేయకపోతే తీవ్ర అనారోగ్యానికి గురవుతూ ప్రాణాపాయ స్థితికెళతారు. ఏలూరులోని రెడ్‌క్రాస్ సొసైటీ తలసేమియా బాధితులకు అండగా నిలబడుతూ వారి జీవితాలకు భరోసా కల్పిస్తోంది.

రెడ్‌క్రాస్ సేవలు

రెడ్‌క్రాస్ సొసైటీకి ఏలూరు, తణుకు, నరసాపురంలో బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. ఏలూరు పరిధిలో నెలకు 400 నుంచి 500 యూనిట్ల రక్తం అవసరం కాగా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు నెలకు 250 నుంచి 300 యూనిట్ల రక్తాన్ని సేకరిస్తూ అనేక మంది ప్రాణాలు నిలబెడుతోంది. తణుకు పరిధిలో 60 యూనిట్లు, నరసాపురం పరిధిలో 60 యూనిట్ల మేర రక్త సేకరణ చేస్తోంది.

నిత్యం రక్తమార్పిడి

ఏలూరు పరిధిలో సుమారు 375 మందికి పైగా తలసేమియా బాధితులు రెడ్‌క్రాస్ తలసేమియా కేంద్రంలో రిజిస్టర్ అయ్యారు. వీరికి నెలకు కనీసం 150 నుంచి 200 యూనిట్ల రక్త నిల్వలు అవసరం. వైద్యులు డాక్టర్ వరప్రసాదరావు, డాక్టర్ చైతన్య కిరణ్ తలసేమియా బాధితులకు సేవలు అందిస్తున్నారు. ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఉన్న తలసేమియా భవనంలో ప్రతి వారం తలసేమియా బాధితులకు రక్తమార్పిడి చికిత్స అందిస్తుంటారు. 80 మంది వరకు ప్రతి నెలా రక్తమార్పిడి చికిత్స అందిస్తున్నారు. తలసేమియా బాధితుల సహాయకులకు సైతం మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తున్నారు.

జన్యులోపంతోనే వ్యాధి సంక్రమణ

తలసేమియా వ్యాధి మన దేశంతోపాటు ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్ దేశాలు, దక్షిణాసియా, దక్షిణ చైనా ప్రాంతాల్లో అధికంగా ఉంది. తల్లిదండ్రుల్లో జన్యుపరమైన లోపాలు, జన్యువుల్లో వ్యత్యాసాలతో ఈ వ్యాధి పుట్టే పిల్లలకు వారసత్వంగా సంక్రమిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. మనం తీసుకునే ఆక్సిజన్, రక్తంలోని ఎర్ర రక్తకణాల్లో హిమోగ్లోబిన్ శరీరంలోని ప్రతి భాగానికి చేరవేస్తుంది. ఎర్ర రక్తకణాల తయారీలో ఏదైనా లోపం జరిగితే ఆయుష్షు తగ్గిపోతుంది. ఈ వాధి లక్షణాలు, చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

వ్యాధి నిర్ధారణ ఇలా..

సీబీసీ (కంప్లీట్ బ్లడ్ కౌంట్) టెస్ట్, హిమోగ్లోబిన్ ఎలక్ట్రోఫొరెసిస్, ఎఫ్‌పీ (ఫ్రీ ఎరిత్రోసైట్ ప్రోటోపోర్ఫైరిన్), ఫెర్రిటీస్ వంటి టెస్ట్‌లతో తలసేమియాను నిర్ధారిస్తారు. గర్భిణుల్లో సీవీఎస్ లేదా యామ్నిసెంటెసిస్ టెస్ట్‌తో పుట్టబోయే బిడ్డకు ఈ వ్యాధిని నిర్ధారిస్తారు. ఆల్ఫా తలసేమియాను డీఎన్ఏ టెస్ట్‌తో నిర్ధారిస్తారు. వ్యాధి తీవ్రత ఆధారంగా తలసేమియా బాధితులకు శరీరంలో ఎర్ర రక్తకణాల సంఖ్యను పెంచేందుకు 15 నుంచి 20 రోజులకు ఒకసారి రక్తమార్పిడి చికిత్స అందిస్తారు.

లక్షణాలు ఇవీ..

కుటుంబంలో ఎవరికైనా తలసేమియా వ్యాధి ఉంటే పుట్టిన పిల్లలకు పరీక్షలు చేయిస్తే ముందుగానే గుర్తించే అవకాశం ఉంది. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న వారిలో మూడు నెలల నుంచి 18 నెలల వయస్సు మధ్యలో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. శరీరంలోని ఎర్ర రక్తకణాలు అధికంగా నాశనం కావటంతో శరీరం రంగు పాలిపోయినట్టుగా మారుతుంది. శారీరక ఎదుగుదల మందగించటం, పచ్చకామెర్లు సోకే ప్రమాదం ఉంది. రక్తహీనత కారణంగా ఆయాసం, అలసట, నీరసం, శరీరంలో వాపులు వస్తాయి. రోగ నిరోధక శక్తి తగ్గిపోవటంతో వ్యాధుల బారిన పడతారు. కాలేయం వాపులు, కాళ్ల అల్సర్స్ వంటి లక్షణాలు కనిపిస్తాయి. తలసేమియా బాధిత పిల్లలు తరచు అనారోగ్యానికి గురవుతూ ఉంటారు. ముఖ్యంగా వాంతులు, విరేచనాలు, శ్వాస సంబంధిత సమస్యలు వస్తుంటాయి.

మెరుగైన వైద్య సేవలు



రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో తలసేమియా బాధితులకు ప్రత్యేకంగా భవనం నిర్మించాం. ప్రతి వారం బాధితులకు రక్తమార్పిడి చికిత్స అందిస్తున్నాం. రెడ్‌క్రాస్‌లో రిజిస్టర్ అయిన తలసేమియా బాధితులకు ప్రతి నెలా ప్రభుత్వం అందించే రూ.10 వేలు పెన్షన్‌కు అర్హత ఉంటుంది. తలసేమియా ఆల్ఫా, బీటా అనే రెండు రకాలుగా ఉంటుంది. ఈ వ్యాధిని ప్రధానంగా నాలుగు దశలుగా చెప్పవచ్చు. తలసేమియా ట్రేట్, మైనర్, ఇంటర్మీడియా, మేజర్‌గా పేర్కొంటారు. తల్లిదండ్రుల్లో జన్యుపరమైన లోపాలతో ఈ వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వ్యాధిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించటంతోపాటు, చికిత్సకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. – డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్, రెడ్‌క్రాస్ చైర్మన్, ఏలూరు జిల్లా

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి సతీష్ కుమార్ నల్లూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ దేవస్థానం కార్యాలయంలో దరఖాస్తులు పొంది ఈ నెల 25లోపు జిల్లా దేవదాయ శాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. అభ్యర్థులు హిందువులై ఉండాలని, వయస్సు 30 ఏళ్లకు పైబడి ఉండాలని, సత్రప్రవర్తన కలిగి ఉండాలని, అభ్యర్థుల పూర్వాపరాలు విచారించే సమయంలో పోలీస్ ఎంక్వైరీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు, మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం మొత్తం 11 మందికి ట్రస్ట్‌బోర్డులో స్థానం ఉంటుందని వివరించారు.

జాగ్రత్తలపై అవగాహన అవసరం

ఏలూరు(మెట్రో): అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకునేలా ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం నిర్వహించిన మాక్ డ్రిల్ అనంతరం ఆమె మాట్లాడుతూ కాకినాడ నుంచి వచ్చిన కేంద్ర విపత్తు నివారణ దళానికి చెందిన 25 మంది సభ్యులు మాక్ డ్రిల్‌లో సహకరించారన్నారు. జిల్లాలో తుఫానులు, వరదలు, వంటి విపత్తు పరిస్థితులను ఎదుర్కొనేందుకు 149 అంబులెన్స్‌లు, 4000 వేల మంది పారా మెడికల్ సిబ్బంది, 475 మంది ఎన్‌సీసీ వలంటీర్లు, 8 ఫైర్ ఇంజిన్లు, 40 అగ్నిమాపక పరికరాలతో పాటు పోలీసు, రెవెన్యూ, ఫైర్, రాష్ట్ర విపత్తు నివారణ సిబ్బంది పాల్గొన్నారని వివరించారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. విపత్తు సమయంలో మూడు సార్లు సైరెన్ మోగిస్తారని, వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాల్సి ఉందని వివరించారు.

సమ్మె విజయవంతం కోరుతూ ప్రదర్శన



ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఏలూరు పట్టణ జట్లు లాగుడు బండ్ల కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు వన్‌టౌన్ మెయిన్ మార్కెట్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఏలూరు అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వర రావు, నాయకులు పి.కిషోర్, ఏలూరు ఏరియా కార్యదర్శి అప్పలరాజులు మాట్లాడారు. బజారు జట్లు హమాలీ కార్మికులు, ఇతర అసంఘటిత రంగ కార్మికులకు ఒక సమగ్ర చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ఏఐటీయూసీ నాయకత్వంలో మర్చంట్ చాంబర్ వారికి అగ్రిమెంట్ డిమాండ్స్ ఇచ్చామని, ఇంకా చర్చలకు పిలవలేదని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కోలా వెంకట భాస్కరరావు, ఏలూరు పట్టణ జట్లు బండ్ల కార్మిక సంఘం యూనియన్ నాయకులు సిరి సొర్ల సోమేశ్వరరావు, పెచ్చేటి నూకరాజు, కరణం సురేష్, కంటపరెడ్డి భాస్కర్, సుందరపు శ్రీను, గేదెల ఈశ్వరరావు, ఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ విడుదల

ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ ముద్రించిన ఈనెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్‌ను ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాస రావు మాట్లాడారు. మీసాల రమణ, ధనను విజయ్, గడసాల రమణ, మంగరాజు రాము,కోరడ అప్పారావు, తాబేలు శివ, నకిరెడ్డి లక్ష్మణ్, దుర్గారావు, సింహాచలం, భాస్కర్, అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి


కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): జిల్లాలోని వ్యవసాయ, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం నిర్వహించిన జిల్లా విద్యుత్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పునరుద్ధరించబడు పంపిణీ రంగ పథకం (ఆర్‌డీఎస్) రూ.176 కోట్లతో వ్యవసాయ ఫీడర్ల నుంచి వ్యవసాయేతర సర్వీసులను వేరుచేసే ఫీడర్ల విభజన కార్యక్రమాలు, రూ.66.51 కోట్లతో ఓవర్ లోడ్ ఫీడర్ల విభజన పనులను డిసెంబర్‌లోగా పూర్తిచేసేందుకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలపై 1912 టోల్ ఫ్రీ అందే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. వ్యవసాయానికి 9 గంటలపాటు నిరంతరాయంగా, అదేవిధంగా గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గానికి కేటాయించిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. విద్యుత్ ఎస్ఈ సాల్మన్ రాజు, ఈఈలు రాధాకృష్ణ, అంబేద్కర్, శశిధర్, ఖాన్, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఏలూరు టౌన్: ఏలూరు మండలం జాలిపూడి గ్రామానికి చెందిన వివాహిత కటారి చిన నాగలక్ష్మి తీవ్ర మానసిక వేదనతో గడ్డిమందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను తొలుత ఏలూరు జీజీహెచ్‌కు అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ సర్వజన ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. ఏలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామవరపుకోట మండలం గంగన్నగూడెం గ్రామానికి చెందిన నాగలక్ష్మి (24)కి చినకొండలుతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 8 నెలల కుమారుడు ఉన్నాడు. కూలీపనులు చేసుకుంటూ జీవించే చినకొండలు కొంతకాలంగా మద్యానికి బానిసగా మారడంతో భార్యభర్త మధ్య విభేదాలు తలెత్తాయి. చిన నాగలక్ష్మి తీవ్ర మనస్థాపంతో గత నెల 24న గడ్డిమందు తిని తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించటంతో మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ సర్వజన ఆసుపత్రికి తరలించారు. నాగలక్ష్మి విజయవాడలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. రూరల్ ఎస్సై సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేపట్టారు.

విపత్తులపై మాక్ డ్రిల్


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం


మాక్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు, వరదలు వంటి సంక్షోభాల సమయంలో ప్రజలను అప్రమత్తంచేందుకు మాక్ డ్రిల్ ఉపయోగపడుతుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. కలెక్టరేట్ పై అంతస్తులో అగ్నిప్రమాదం సంభవించింది మొదలు నిచ్చెన ఆసరాగా భవనంపైకి విపత్తు స్పందన సిబ్బంది చేరుకుని ప్రమాదంలో చిక్కుకున్న వారిని కిందికి తీసుకొచ్చి తక్షణం వైద్య సహాయం అందించేందుకు 108 వాహనాలు ద్వారా ఆసుపత్రికి తరలించడం వంటి అంశాలను వివరించారు. వీటన్నింటిని కలెక్టర్ వెట్రిసెల్వి స్వయంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ సీహెచ్ రత్నబాబు, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు, డీసీహెచ్ఎస్ పాల్ సతీష్ కుమార్, ఎన్‌టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ రాజీవ్, సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్‌వీ నాగరాణి, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య, తహసీల్దారు జి.శేషగిరి, కలెక్టరేట్ సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

గార్డ్ డ్యూటీ సిబ్బందికి కూలర్లు


క్రాంప్టన్ కూలర్లు అందించిన ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమమూ కీలకమేనని పోలీస్ బాస్, ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ నిరూపించారు. వేసవి ఎండలు మండుతోన్న తరుణంలో ఏలూరు ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో గార్డ్ డ్యూటీ చేస్తోన్న సిబ్బందికి చల్లటి వాతావరణం కల్పిస్తూ.. కూలర్లను అందజేశారు. గార్డ్ డ్యూటీ సిబ్బంది కోసం 13 క్రాంప్టన్ కూలర్లు ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్‌కు ఎస్పీ అందజేశారు. ఒక్కో కూలర్ రూ.7 వేలకు ఎస్పీ కొనుగోలు చేసి అందించడం పట్ల సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలి

బుట్టాయగూడెం: గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలని, షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక నోటిఫికేషన్ ప్రకటించాలని జిల్లా ఆదివాసీ కార్యాచరణ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆ సంఘ సమావేశం బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి శివారులో కొత్త సింగన్నపల్లి కమ్యూనిటీ హాల్ వద్ద మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు.

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర


కూలీల సమస్యలను తెలుసుకుంటున్న రామకృష్ణ

లింగపాలెం: పేదలకు ఉపాధి కల్పిస్తోన్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలక వర్గాలు కుట్ర చేస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం ఆయన లింగపాలెం మండలం అయ్యపరాజుగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీల పని ప్రదేశాలను ఆయన పర్యటించారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని తిరిగి పోరాడి రక్షించుకొనేందుకు మే 20న ఉపాధి పనులు బంద్ చేయాలని, మండల కేంద్రాలు, గ్రామ సచివాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు అప్పలస్వామి మాట్లాడుతూ 100 రోజులు పనులు చూపించాలంటే కేంద్ర బడ్జెట్లో 2.50 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిధులు కోతతో కనీసం 30 రోజులు కూడా పనులు దక్కడం లేదని ఆరోపించారు. పని చేసిన రెండు వారాల్లోపు వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా, ఐదు వారాలుగా వేతనాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్ మెట్లు మధు, ఉషారాణి, అనిత, గోపి, జ్యోతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.300 వేతనం ఇవ్వాలి

కామవరపుకోట: ఉపాధి హామీ పథకం కూలీలకు ఖచ్చితంగా సరాసరి వేతనం రూ.300 వచ్చే విధంగా క్షేత్ర స్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎం సరళ కుమారి అన్నారు. మంగళవారం కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామంలోని లింగరాజులకుంట చెరువు వద్ద ఆమె పనికి సంబంధించిన మస్టర్లను పరిశీలించారు. పని ప్రదేశంలో సౌకర్యాల ఏర్పాటుపై ఆరా తీశారు.

మేరీ మాత ఆలయం ప్రారంభం

లింగపాలెం: మండలంలోని పాశ్చానగరం విచారణ, తొమ్మండ్రువారిగూడెంలో వేళాంకణి మేరీమాత నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం మంగళవారం నిర్వహించారు. హేలాపురి కాథలిక్ పీఠాధిపతులు పొలిమేర జయరావు, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌లు పాల్గొని పరిశుద్ధ మందిరాన్ని ప్రారంభించారు. పలువురు గురువులు, సిస్టర్లు, ఉపదేశీ మాస్టర్లు, నాయకులు భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	23
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	11
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	23
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	07
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	18
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

ముగిసిన పుష్పయాగ మహోత్సవాలు


ఉత్సవ పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక బావిశెట్టి వారిపేట శ్రీ కనకదుర్గాంబ ఆలయంలో అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవ, పుష్పయాగ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం పూజలు, హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అర్చకుడు యడవల్లిత శ్రీహరి శర్మ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

హిందూ ధర్మ పరిరక్షణతోనే మనుగడ


స్వామి, అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: హిందూ ధర్మ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని అర్చకులు, పండితులు ఉద్బోధించారు. శ్రీవారి నిత్య కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం వేద సభను నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం జరిగిన మరుసటి రోజు ఈ కార్యక్రమం నిర్వహించడం ఇక్కడ సాంప్రదాయంగా వస్తోంది. తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి తొళక్క వాహనంపై మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ నిత్యకల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. ఆ తరువాత కల్యాణ మండపంలో రజిత సింహాసనంపై కల్యాణ మూర్తులను వేంచేపు చేసి, విశేష పుష్పాలంకారాలు చేశారు. ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి అందించిన వివిధ రకాల ఫలాలు, పుష్పాలను స్వామివారి ముందుంచారు. శ్రీవారు, అమ్మవార్లు కొలువైన వేదిక ముందు అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆగమ విద్యార్థులు కొలువు తీరారు. స్వామి, అమ్మవార్ల గుణగణాలను కీర్తిస్తూ.. వేద మంత్రోచ్చరణలు నిర్వహించారు. అనంతరం శ్రీవారు, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అర్చకులు హారతులిచ్చి, నీరాజన మంత్రపుష్పాలను సమర్పించారు. అర్చకులు, పండితులను ఆలయ ఈఓ ఘనంగా సత్కరించారు.